## క్లుప్తంగా

### వినాయకస్వామి మండప పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమార స్వామి తిప్ప వద్ద ఉన్న శ్రీవినాయకస్వామి మండప నిర్మాణ పనులను గురువారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువైపులా ఆక్రమణలు ఎక్కువగా ఉన్న కారణంగా ప్రహరీగోడను నిర్మించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

### ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: మండలంలోని అబ్బాబట్లపల్లి ఎస్టీకాలనీలో సుబ్బమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. సుబ్బమ్మ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. నాయకులు సునీల్, పోలయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యతగా మధ్యాహ్న భోజనం



రాగి జావ రుచి చూస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకం కింద రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని వంట నిర్వాహకులకు మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన గురువారం మండలంలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల్లో రాగి జావ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పదార్థాల రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

### పాఠశాల అభివృద్ధికి వితరణ



చెక్కు అందిస్తున్న వీరభద్ర

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థి రూ. 50 వేలను విరాళంగా అందించారని హెచ్‌ఎం మనోహరి తెలిపారు. పూర్వ విద్యార్థి, తుంబూరు గ్రామానికి చెందిన వీరభద్రం గురువారం రూ.50 వేలను చెక్కు రూపంలో అందజేశారని పేర్కొన్నారు.

### నియామకం

సత్యవేడు: మండలంలో రాచపాళెం అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలిగా ఎం.శాంతి నియమితులయ్యారు. గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఈమేరకు గురువారం నియామక పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రూబెన్ పాల్గొన్నారు.

### ఎంపీఈవో ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి :మండలంలోని ఇనగలూరు ఆర్‌బీకేలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీఈవో) శ్రీలక్ష్మి(30) గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతికి చెందిన శ్రీలక్ష్మి(30) ఇనగలూరు ఆర్‌బీకేలో ఎంపీఈవోగా పనిచేస్తున్నారు. సహజంగా ఎంపీఈవోలు ఎరువులను విక్రయించి వచ్చే నగదును ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్ బ్యాంకు అకౌంట్‌లో జమచేయాల్సి ఉంది. గత పదిహేను రోజులుగా ఇక్కడి ఆర్‌బీకేలో రూ.73,000లకు ఎరువుల విక్రయాలు జరిగినా శ్రీలక్ష్మి నగదును జమ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. ఎరువుల ఎంపీఈవోలు నగదును జమచేయాలంటూ మంగళవారం వ్యవసాయాధికారి నుంచి సంబంధిత వాట్సాప్ గ్రూపులో మెసేజ్ వచ్చింది. అదేరోజు రాత్రి శ్రీలక్ష్మి గాజులమండ్యం సమీపంలో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కంగారుపడిన కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా గొంతుకోసుకుని రక్తస్రావం జరుగుతుండడంతో రేణిగుంటలోని ఓ ఆస్పత్రికి తరలించగా, ప్రమాదం తప్పడంతో కోలుకుంటోంది. కాగా రైతుభరోసా కేంద్రంలో ఎరువులు అమ్మిన డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమచేయమని అధికారులు కోరడంతో ఏమి చేయాలో తోచక తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శ్రీలక్ష్మి ఆస్పత్రి నుంచి ఓ వాట్సాప్ వీడియో రిలీజ్ చేయడం కొసమెరుపు.

# ఇళ్ల స్థలాలకు పక్కాగా రిజిస్ట్రేషన్లు

- జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- గ్రామ పంచాయతీల్లోనే..
- టీడీపీ హయాంలో ఎలాంటి హక్కులు ఉండేవి కావు



కాళమనాయుడుపేట సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సచివాలయ సిబ్బంది

సత్యవేడు: జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శిక్షణ పొందిన వీఆర్‌ఓలు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ నిర్వహణ ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల లబ్ధిదారులకు డీకేటీ పట్టాలు మాత్రమే ఇచ్చేవారు, గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకునేది. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు, అప్పులు పుట్టక ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది.

**ఇంటిపై సర్వహక్కులు**

పేదల ఇళ్లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్వహక్కులు కల్పిస్తున్నారు. ఇంటిపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వర్షన్ డీడ్ అందజేస్తున్నారు. ఇందు కోసం భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. తద్వారా లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి.

**మండలంలో ఇలా..**

మండలంలో తొలివిడతగా 563 మందికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పీవీపురంలో 91, ఇరుగుళంలో 20, చిన్న ఈటిపాకంలో 34, కొత్తమారికుప్పం(కాళమనాయుడుపేట)లో 69, మదనంబేడులో 42, శిరునంబుదూరులో 69, చెన్నేరిలో 77, సత్యవేడులో 151 మందికి సచివాలయాల్లో పట్టాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సెక్రటరీలు హరీష్, ఎం.లోకేష్, వీఆర్‌ఓ పి.విక్రాంత్, డిజిటల్ అసిసెంట్ ఎస్.గోవర్ధన్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులూ కల్పిస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రత్యర్థుల గుండెల్లో రీసౌండ్ రావాలి



ప్రజలకు అభివాదం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- వైఎస్సార్ సీపీని ఆదరించండి
- నిత్యం ప్రజా సేవలోనే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థుల గుండెల్లో రీసౌండ్ వచ్చేలా వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి కోరారు. గురువారం సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్ధం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరు, రామానాయుడు ఎస్టీకాలనీ, పొయ్య హరిజనవాడ, పొయ్య గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సీఎం జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలను వివరించారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజాసేవలో ఉన్నారని, కరోనా కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలిచారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నాలుగు సంవత్సరాలు ప్రజలకు కనబడకుండా పోయిన టీడీపీ నాయకులు నేడు ప్రజలపై కపట ప్రేమ చూపుతూ, అవాస్తవాలతో మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వారి మాటలను నమ్మే స్థితిలో లేరని తెలిపారు. అంతకు ముందు బియ్యపు శ్రీవాణిరెడ్డికి వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు వాసునాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు మునిరత్నం, కన్వీనర్ శంకరయ్య, జేసీఎస్ కన్వీనర్ భక్తవత్సలం, మణినాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, ఢిల్లీబాబు, గెరటారెడ్డి, శ్రీరాములురెడ్డి, గురవారెడ్డి, గిరిరెడ్డి, మోహన్, మణి, నరసింహులు, నెలవల ప్రసాద్, గంధం శీను, రాజేంద్ర, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, సుబ్బారాయుడు, వెంకీ, సుబ్బయ్య నాయుడు, రమణయ్యనాయుడు, సుబ్రహ్మణ్యంయాదవ్, నరసింహనాయుడు, వెంగళరావు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తా

▸ సత్యవేడు సమన్వయకర్త రాజేష్

గంగాధర నెల్లూరు: అధిష్టానం ఏ ఉద్దేశంతో అయితే తనకు వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్తగా నియమించిందో ఆ లక్ష్యసాధనకు అంకితభావంతో కృషి చేస్తానని నూకతోటి రాజేష్ స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలో పార్టీ అధిష్టానం విడుదల చేసిన నియోజకవర్గాల ఇన్‌చార్జుల జాబితాలో సత్యవేడు అసెంబ్లీ స్థానానికి రాజేష్‌ను ఖరారు చేయడం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఆయన మండలంలో వింజం పంచాయతీలోని లక్ష్మీరెడ్డిపల్లెకు వచ్చారు. ఇక్కడ తన మాతృమూర్తి, దివంగత మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్దకు వెళ్లి పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కుటుంబ పరంగా, రాజకీయ పరంగా ఏ కార్యం తలపెట్టినా తొలుత తన తల్లి సమాధికి నివాళులు అర్పించి, ఆశీస్సులు పొందడం..మానసికంగా ఎంతో బలాన్ని, ధైర్యాన్నీ ఇస్తుందని, ఆ స్థైర్యంతోనే సత్యవేడు సెగ్మెంట్‌లో అందరి సహకారంతో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పాటుపడతానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లాలోని పార్టీ సీనియర్ నాయకులందరి ఆశీస్సులు, సత్యవేడు నాయకుల సమన్వయ సహకారంతో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. చెప్పారు. తొలుత ఆయనకు గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పుష్పగుచ్ఛాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు.

### మత్తుతో జీవితాలు నాశనం

ఏర్పేడు: మత్తుకు బానిసలయ్యే వారి కుటుంబాలు ఛిద్రమవుతాయని రాస్ మత్తు పదార్థాల పునరావాస కేంద్రం కౌన్సిలర్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు వ్యసనాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియంత్రణలేని మద్యం ప్రాణాపాయమన్నారు. పలువురు విద్యార్థులు సమకాలిక పిల్లలతో కలసి పొగ తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసలైన వారిని పాపానాయుడుపేట మత్తు పదార్థాల పునవారాస కేంద్రంలో చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా సాధారణ స్థితికి తీసుకుని వస్తామని చెప్పారు. హెచ్‌ఎం రాజువేలు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మునీశ్వరస్వామిసేవలో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి



ఆలయానికి వెళుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

ఏర్పేడు: కర్ణాటక రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి దంపతులు మండలంలోని స్వగ్రామమైన ఎండీపుత్తూరులో కులదైవం శ్రీమునీశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ముందుగా సర్పంచ్ మోహనప్రియ, గ్రామస్తులు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన కులదైవం మునీశ్వర స్వామి, గ్రామ దేవత యల్లమ్మను దర్శించుకోవడం మహద్భాగ్యంగా చెప్పారు. తమ గ్రామ ప్రజలు ఆదరణ వెలకట్టలేనిదని తెలిపారు. స్నేహితులతో నాటి జ్ఞాపకాలు, తీపి గురుతులు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పద్మమ్మ, గ్రామస్తులు కేశవులు యాదవ్, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, బాలాజీరెడ్డి, సుబ్రమణ్యం ఆచారి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మామిడి తోటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామాల్లోని మామిడి తోటలను మండల ఉద్యానవనశాఖాధికారి యామిని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. గురువారం 'సాక్షి'లో 'మామిడికి మంచు దెబ్బ' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఉదయం క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించి రైతులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా మంచుతో తేనే మంచు పురుగు ఆశించి ఉందని, ఈకారణంగానే మామిడి చెట్లలో పూత రావడం లేదన్నారు. తేనే మంచు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా మంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తామర పురుగు నివారణకు ఫ్రూట్ కవర్స్‌ను వాడాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా 7995086941 నంబర్‌కు ఫోన్ చేస్తే మామిడి, మిరప పంటల సాగుకు సంబంధించి సూచనలు ఇస్తామన్నారు.



కనమనంబేడులో సూచనలిస్తున్న ఉద్యానవనశాఖాధికారి యామిని

### పఠనా సామర్థ్యాలను పెంపొందించాలి



సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సత్యవేడు: ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్టుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ కె.రవి సూచించారు. గురువారం గొల్లపాళెం ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలు వేసి సామర్థ్యాలను తెలుసుకొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. రుచి కరమైన భోజనాన్ని పెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. పదార్థాలు రుచి చూశారు. హెచ్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నాగలాపురం జట్టు



క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

నాగలాపురం: ఆడుదాం-ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటి నాగలాపురం సచివాలయం జట్టు రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. గురువారం తిరుపతిలో జరిగిన కబడ్డీ ఫైనల్స్‌లో సూళ్లూరుపేట, నాగలాపురం జట్లు తలపడ్డాయి. నాగలాపురం జట్టు విజేతగా నిలిచినట్లు పంచాయతీ కార్యదర్శి హరి తెలిపారు. జట్టు క్రీడాకారులను సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, పలువురు నాయకులు అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కేవీబీపురం: మండలంలోని ఆరె ప్రధాన మలుపు వద్ద స్కూటర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ సునీల్ కథనం.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన వాయిద్య కారుడు మునస్వామి(45)ద్విచక్ర వాహనంపై దిగువపుత్తూరులో డోలు వాయించేందుకు బయలుదేరాడు. ఆరె ప్రధాన మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పిచ్చాటూరు నుంచి కేవీబీపురం వైపు వస్తున్న దిగువపూడి గ్రామానికి చెందిన కారు ఢీకొంది. ఈ ఘటనలో మునస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. కారు నడుపుతున్న వ్యక్తే 108కి సమాచారం అందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కట్నం వేధింపులు.. ఏడుగురిపై కేసు

ఏర్పేడు: అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు గురువారం రాత్రి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మన్నసముద్రం గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి రేణిగుంట మండలం కాటన్‌మిల్లు పూలవానిగుంట వీధికి చెందిన బాలకృష్ణతో 2022 సెప్టెంబర్ 8న వివాహమైంది. అప్పట్లో రూ.5 లక్షల నగదు, 20 సవర్ల బంగారు నగలను కట్నంగా అందజేశారు. రెండునెలలు సంతోషంగా కాపురం చేశారు. అనంతరం అదనపు కట్నంకోసం బాలకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు కిరణ్‌కుమార్, చిట్టెమ్మ, సుబ్రమణ్యంరెడ్డి, లావణ్య, శ్యామల, సుబ్రమణ్యం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

### ఆధార్ సేవలను కొనసాగించండి

నాగలాపురం: నాగలాపురం సచివాలయం-1లో ఆధార్ సేవలను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో 19 పంచాయతీలు ఉన్నాయి. ఇంతకముందు ఆధార్ సేవలు అందుబాటులో ఉండేవి. కొద్ది రోజుల కిందట నిలిపి వేశారు. ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ లింకు, పుట్టిన తేదీల మార్పు, ఇతర సేవల కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఆగమోక్తంగా బాలాలయ స్థాపన పూజలు



కలశాలలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న అర్చకులు



కలశ పూజలు చేస్తున్న వేదపండితులు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ఏడు గంగమ్మల ఆలయ జీర్ణోద్ధారణ, ఆధునికీకరణ పనుల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా బాలాలయ పూజలు నిర్వహించారు. ముందుగా కలశ స్థాపనను శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలను నిర్వహించారు. ప్రధాన కలశాన్ని ఆలయ ఆవరణంలో వైభవంగా ఊరిగించి, గంగమ్మ తల్లికి కలశ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. తదుపరి సంప్రదాయ పద్ధతిలో బాలాలయ పూజలను పండితులు వేదోక్తంగా నిర్వహించారు.

**రూ.40 లక్షలతో ఆధునికీకరణ**

పూజల్లో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడు గంగమ్మల ఆలయాన్ని రూ.40లక్షలతో ఆధునీకరణ చేసి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. పాలకమండలి సభ్యురాలు రమాప్రభ, ఆలయ అధికారులు వెంకటసుబ్బయ్య, స్థపతి కుమార్, సూర్యప్రసాద్, వేదపండితులు సంబంధం గురుకుల్, దక్షిణామూర్తి, అర్ధగిరి, ప్రముఖులు బాలసుబ్రహ్మణ్యం, స్వర్ణమూర్తి, భాస్కర్ ముదిరాజ్, జలకం కిషోర్, రవి, బాలగౌడ్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలో బీసీలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని దుర్గిపేరిలో ఆయన వన్నెరెడ్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బీసీలపై వివక్ష జరిగినట్లు చెప్పారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బీసీల అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ మునిరామయ్య, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, నాయకులు వడ్లతాంగళ్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, దామోదరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేకువనే పెన్షన్ల పంపిణీ





ఏర్పేడులో పింఛన్ల పంపిణీ, బీఎన్‌కండ్రిగ : జీఎన్‌కండ్రిగలో...

ఏర్పేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గురువారం వేకువ జాము నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాల పెన్షన్‌దారులను కలిసి వేలిముద్రలు సేకరించి నగదును అందజేశారు. ఏర్పేడులో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య వలంటీర్లతో పాటు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదును అందజేశారు.

**బీఎన్‌కండ్రిగ మండలంలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గురువారం ఒకటే తేదీనే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారు జాము ఐదు గంటల నుంచే పంపిణీని ప్రారంభించారు. ఆలత్తూరు. కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, జీఎస్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సాయంత్రంలోపు 96 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడంపై పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు.

**పిచ్చాటూరులో 87 శాతం పంపిణీ**

పిచ్చాటూరు: ఒకటో తేదీ గురువారం రోజే 87 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మిగిలిన 13 శాతం శుక్ర, శని వారాల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని అడవికొడియంబేడులో జెడ్పీటీసీ సభ్యురాలు కె.విష్ణుప్రియ, సర్పంచ్ కె.కిరణ్‌కుమార్, కేవీ భాస్కర్ నాయుడు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. తన స్వగ్రామమైన అడవికొడియంబేడు పంచాయతీలో మాత్రమే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు వైఎస్సార్ పింఛను కానుక కింద 220 మందికి రూ.6.80 లక్షలు తొలిరోజే అందించినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు కె.విష్ణుప్రియ వెల్లడించారు. ఇంత భారీ ఎత్తుల పింఛన్లు పంపిణీ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. పంచాయితీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో డయాలసిస్ రూ.10 వేలు పింఛన్ పంపిణీ

**వేగవంతంగా..**

వరదయ్యపాళెం: మండలంలో పింఛన్ల పంపిణీని వలంటీర్లు గురువారం వేగవంతంగా పంపిణీ చేశారు. 6,592 పింఛన్లకు సంబంధించి 4,954 మందికి మొదటి రోజే పంపిణీ చేసి 75శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.1,47,41,500 లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.